# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ఇతర పార్టీల నేతలు
- పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఖానాపురం: బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే పెద్ది

ఖానాపురం, జూలై 19: బీఆర్‌ఎస్ సర్కారుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బాలుతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పెద్ది వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిరుపేదల కోసం అమలు సంక్షేమ పథకాలు, రైతు అనుకూల నిర్ణయాలకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో భూక్యా సోమ్లా, తేజావత్ రవి, గుగులోత్ రాము, తేజావత్ బాలాజీ, మేడి కిరణ్, గుగులోత్ సుమన్ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మంగ్యానాయక్, రవి కైకా, బానోత్ వీరన్న, బావుసింగ్, హరి పాల్గొన్నారు.

### కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత

వేపచెట్టుతండాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గుగులోత్ భిక్షపతి ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబానికి పార్టీ తరపున మంజూరైన రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో కార్యకర్తలకు పార్టీ తరపున బీమా సదుపాయం కల్పించారని కొనియాడారు. దేశంలో అత్యధికంగా కార్యకర్తలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా పద్మావతి, వెంకన్న, మూడు రమేశ్ పాల్గొన్నారు.

### మహిళా సాధికారతతే లక్ష్యం..

నెక్కొండ: మహిళా సాధికారికతే లక్ష్యంగా నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 3,500 మంది మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నెక్కొండలో మండలంలో మొదటి విడుతలో పది శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెక్కొండ రైతు వేదికలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. జడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న, నెక్కొండ ప్రాంత నాయకులు, అధికారుల కోరిక మేరకు మండలంలో మొదటి విడుతలో పది కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగి కుటుంబానికి ఆసరాగా ఉండాలని కోరారు. ఒక్కో కేంద్రంలో 50 మందికి శిక్షణ ఇస్తున్నామని, టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలు వచ్చిన తర్వాత కంపెనీ వారే బస్సుల్లో ఉదయం తీసుకెళ్లి, సాయంత్రం తీసుకొస్తారనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, జడ్పీటీసీ లావుడ్యా సరోజా హరికిషన్, నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, గ్రామైక్య సంఘం ప్రతినిధులు కొమ్ము రుక్మిణి, ఏపీవో శ్రీనివాస్, మండల నాయకులు గుంటుక సోమయ్య, సారంగపాణి, దేవనబోయిన వీరభద్రయ్య, తాటిపెల్లి శివకుమార్, కారింగుల సురేశ్, బొల్లెబోయిన వీరస్వామి పాల్గొన్నారు.



నెక్కొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

### మహిళలు చైతన్యవంతులు కావాలి

నర్సంపేట: మహిళలు చైతన్యవంతులు కావాలని ఎమ్మెల్యే పెద్ది అన్నారు. నర్సంపేటలో రెడ్డి మహిళా పరపతి సంఘం పదో వార్షిక మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్ది హాజరై మాట్లాడారు. మహిళలు పొదుపు అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళ పరపతి సంఘంలో పొదుపులు, అప్పులు సమయపాలనలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గోపు జైపాల్‌రెడ్డి, డాక్టర్ అండ్ర రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ రామసహాయం శ్రీదేవి, రాయిడి కీర్తి, కంది గోపాల్‌రెడ్డి, ఎర్ర యాకూబ్‌రెడ్డి, ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, ఎర్ర ఊర్మిళ, గాలి సువర్ణ, మోతె అరుణాదేవి, కాసర్ల జయప్రద, నల్లా భారతి, మోతె నీరజ, కంది విజయ, గంట గీత, బైరెడ్డి హైమావతి, గోపు అరుణ, అడ్డూరి సరోజన, గంట లక్ష్మీదేవి, బుర్ర నర్మద, అండ్రు వనజ, బీరం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# డీవార్మింగ్ డేను జయప్రదం చేయాలి

- నర్సంపేట ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు
- అల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన సదస్సులు



నర్సంపేటరూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో

నర్సంపేటరూరల్/నర్సంపేట/చెన్నారావుపేట, జూలై 19: నర్సంపేట మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం నిర్వహించనున్న జాతీయ నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు, భాంజీపేట పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి దేవేందర్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, భాంజీపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వేర్వేరుగా బుధవారం అల్బెండజోల్ మాత్రల పంపిణీపై ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. నేడు మధ్యాహ్నం పాఠశాల, కళాశాలల విద్యార్థులకు విధిగా మాత్రలు వేయాలన్నారు. 1 నుంచి 2 ఏళ్ల లోపు పిల్లలకు అల్బెండజోల్ 400 ఎంజీలో సగం మాత్ర, రెండేళ్లు పైబడి 19 ఏళ్లలోపు వారికి పూర్తి టాబ్లె ట్ వేయాలని సూచించారు. మాత్ర వేసుకున్న వారిలో ఎవరికైనా సమస్య ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సదస్సులో ఎంపీవో అంబటి సునీల్‌కుమార్‌రాజ్, యూడీసీ శ్రీనివాస్, హెచ్‌ఈవో సంజీవరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేటలోని సంజయ్‌నగర్, పోచమ్మవీధి ప్రాంతాల్లో నులిపురుగల నివారణపై విస్తృత ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం-6 టీచర్ ఉమాదేవి మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపంతో ఉంటారని, రక్తహీనతతో ఎప్పుడూ అలటగా ఉంటారని తెలిపారు. విధిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. అంతేకాకుండా చెన్నారావుపేటలోని ఐకేపీ సెంటర్‌లో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగుల నిర్మూలనపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సరోజ మాట్లాడుతూ పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

## ఓపెన్‌స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

నర్సంపేట, జూలై 19: పాఠశాలకు దూరమైన విద్యార్థుల కోసం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు నర్సంపేట మోడల్ స్కూల్ హెచ్‌ఎం రమేశ్‌బాబు తెలిపారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆగస్టు 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు. మోడల్ స్కూల్‌లో నేరుగా ఉపాధ్యాయుడు పోతుగంటి కుమారస్వామి లేదా 9640162614 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## మండలకేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చెన్నారావుపేట, జూలై 19: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు మండలకేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండొద్దని, వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దని సూచించారు. అత్యవసర సహాయం కోసం ప్రజలు కంట్రోల్ రూం నంబర్లు 9502332119, 8008092664లో సంప్రదించాని సూచించారు.

## అవిశ్వాసంపై ఎంపీపీకి నోటీసులు అందజేత

చెన్నారావుపేట, జూలై 19: ఎంపీపీ బదావత్ విజేందర్‌కు బుధవారం అవిశ్వాస తీర్మానం నోటీసులు అందినట్లు తెలిసింది. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడుతున్నాడని ఆరోపిస్తూ విజేందర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 15న మండలంలోని ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల 9వ తేదీన మండల పరిషత్ కార్యాలమంలో అవిశ్వాసంపై సమావేశం జరుగనుందని, ఈ సమావేశానికి అందరూ అందుబాటులో ఉండాలని నర్సంపేట ఆర్డీవో ఎంపీపీ సహా ఎంపీటీసీలందరికీ నోటీసు పత్రాలు అందజేశారు.

### ఘనంగా మైసమ్మ బోనాలు

కరీమాబాద్, జూలై 19: పిల్లాపాపలను చల్లంగ చూడు తల్లీ.. అంటూ కట్టమైసమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని కరీమాబాద్ కాశికుంటలో బుధవారం భక్తులు కట్టమైసమ్మకు నైవేద్యంగా బోనాలు సమర్పించారు. ఏటా ఆషాఢ మాసంలో మైసమ్మతల్లికి బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తున్నదని గురుస్వామి భవాణి లవన్ కుమార్ తెలిపారు. డప్పుచప్పుళ్ల నడుమ శివసత్తులు బోనాలతో ఆలయానికి చేరుకోగా, భక్తులు పిల్లాపాపలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఖానాపురం, జూలై 19: జీవితంలో స్థిరపడలేకపోయాననే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పిట్టల తిరుపతి కథనం ప్రకారం.. బుధరావుపేటకు చెందిన గొల్లపెల్లి జీవన్(26) గీత వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. జీవనం కష్టంగా మారడంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ మిత్రులతో జీవితంపై విరక్తి కలుగుతున్నదని చెప్పేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆర్డీవో కృష్ణవేణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ రామ్మూర్తి

### ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

నర్సంపేట, జూలై 19: నర్సంపేట ఆర్డీవోగా కె.కృష్ణవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పని చేసిన కృష్ణవేణి ఇటీవల బదిలీపై వచ్చారు. నర్సంపేటలో పని చేసిన శ్రీనివాసులు కొన్ని రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఆర్డీవోగా మహేందర్‌జీ వ్యవహరించారు. ఈ మేరకు కృష్ణవేణి మహేందర్‌జీ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఏవో నాగరాజు, నర్సంపేట డివిజన్‌లోని తహసీల్దార్లు ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసం రామ్మూరి, డిప్యూటీ తహసీల్దార్ ఉమారాణి, ఎలక్షన్ డీటీ సంధ్యారాణి, ఆర్‌ఐలు రజాక్, రషీద్, సిబ్బంది ఆర్డీవోను కలిసిన వారిలో పాల్గొన్నారు.

### ‘విద్యావ్యతిరేక విధానాలను ఖండించాలి’

చెన్నారావుపేట, జూలై 19: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా వ్యతిరేక విధానాలను ఖండించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంగోత్ భద్రయ్య పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ దశల వారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం జల్లి, అమీనాబాద్, ఖాదర్‌పేట, కోనాపురం పాఠశాలల్లో భోజన విరామ సయమంలో నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ విద్యా విధానం వ్యాపారీకరణ, కాషాయీకరణ పెంచేదిగా ఉందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రజాస్వామ్య, శాస్త్రీయ, సామాజిక విలువల ప్రస్తావన లేదని, శాస్త్రీయ విలువలతో కూడిన విద్యా విధానం ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో కొమురయ్య, ఉమాశంకర్, యాకయ్య, భద్రయ్య, కట్టస్వామి, వెంకటేశ్వర్లు, రవి, నర్సయ్య, సాంబయ్య, రోజారాణి పాల్గొన్నారు.

# గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, జూలై 19: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఖాళీగా ఉన్న 19 గెస్ట్ లెక్చరర్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో 2023-24 విద్యా సంవత్సరానికి భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో కాక మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపురం జీజేసీలో-3 పోస్టులు (ఫిజిక్స్-1, మ్యాథ్స్-1, సివిక్స్-1), నర్సంపేట జీజేసీలో (కో-ఎడ్యుకేషన్)-2 పోస్టులు (మ్యాథ్స్-1, బాటనీ-1), నర్సంపేట బాలికల కళాశాలలో-3 (మ్యాథ్స్-1, ఫిజిక్స్-1, బాటనీ-1), వర్ధన్నపేట జీజేసీలో ఒకటి (మ్యాథ్స్), రాయపర్తి జీజేసీలో ఒకటి (మ్యాథ్స్), సంగెం జీజేసీలో 2 పోస్టులు (మ్యాథ్స్-1, హిస్టరీ-1), నెక్కొండ జీజేసీలో 3 పోస్టులు (మ్యాథ్స్-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1), రంగశాయిపేట జీజేసీలో ఒకటి (మ్యాథ్స్), కృష్ణాకాలనీ జీజేసీ(బాలికలు)లో 3 పోస్టుల( మ్యాథ్స్-1, జువాలజీ-1, ఎంపీహెచ్‌డబ్ల్యూ-1) చొప్పున జిల్లాలో 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అతిథి అధ్యాపకులకు పీరియడ్‌కు రూ. 390 చొప్పున గరిష్ఠంగా నెలకు 72 పీరియడ్లకు పని చేసిన రోజులకు మాత్రమే వేతనం ఇస్తారని పేర్కొన్నారు. ఈ నియామకం పూర్తిగా 2023-24 విద్యా సంవత్సరానికే పరిమతమని స్పష్టం చేశారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 50 శాతం కన్నా ఎక్కువ మార్కులు ఉన్న అభ్యర్థులు విద్యార్హత జిరాక్స్ పత్రాలను పూర్తి చేసిన దరఖాస్తులను జత చేసి ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా హనుమకొండ ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఉన్న డీఐఈవో కార్యాలయంలో అందజేయాలని మాధవరావు కోరారు. అభ్యర్థుల ఎంపిక కలెక్టర్ ఆధ్వర్యంలో ఉంటుందని, ఎలాంటి పైరవీలకు తావులేదని డీఐఈవో వెల్లడించారు.

# ‘నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి’

నర్సంపేటరూరల్, జూలై 19: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఎంసీపీఐయూ మండల నాయకుడు జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. పాతముగ్దుంపురం జాగృతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంసీపీఐయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ వారసత్వ ఉద్యోగాలు కల్పించాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు భూక్యా గోపాల్‌నాయక్, అబ్బదాసి అశోక్, రాజు, రవి, మహేశ్, కుమార్, రాజేందర్, సాంబయ్య, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ నాయకుడు రమేశ్



ఆర్థిక సాయం అందజేస్తున్న పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సంపేట, జూలై 19: నర్సంపేట పట్టణానికి చెందిన అంకం సాంబయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాముల శంకరయ్య, బాల్నె సుభాష్, గోక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.